చేతి నిండా 'ఉపాధి'

- రూ.11.12 కోట్లతో ఈజీఎస్ బడ్జెట్ ప్రతిపాదన
- 480 పనుల గుర్తింపు
- 2.60 లక్షల పనిదినాలు లక్ష్యం



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రెబ్బెన: గ్రామీణ ప్రాంత ప్రజల వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇటీవల కొన్ని మార్పులు, చేర్పులు చేసి కూలీలకు చేతినిండా పని కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా కూలీలకు చేతినిండా పని కల్పించేందుకు పథకంలో కొన్ని మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటివరకు సాధారణ పద్ధతిలో ఉన్న హాజరు నమోదును ఆన్‌లైన్ పద్ధతిలోకి మార్చింది. కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించాలనే లక్ష్యంతో అధికారులు ప్రతి పంచాయతీలో గ్రామసభలు నిర్వహించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల బడ్జెట్‌ను తయారు చేశారు. కూలీలకు పనులు కల్పించడంతో పాటు రైతులకు ఉపయోగపడేలా పనులు గుర్తించారు.

రూ.11.12 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలు

మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 6916 జాబ్‌కార్డులు ఉండగా, 12,726 మంది కూలీలు పని చేస్తున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పూర్తిస్థాయిలో కూలీలకు పనులు కల్పించాలనే లక్ష్యంతో రూ11.12 కోట్లతో బడ్జెట్ కోసం ప్రతిపాదనలు పంపించారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి వచ్చే సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు గుర్తించారు. ఈ గ్రామసభల ద్వారా వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టేందుకు 480 పనులను ఈజీఎస్ అధికారులు గుర్తించారు. ప్రతీ కుటుంబానికి 100రోజులు పనులు కల్పించేందుకు వచ్చే సంవత్సరంలో 2,60,024 పని దినాలను కూలీలకు ఖరారు చేశారు. వచ్చే సంవత్సరం కోసం గుర్తించిన పనులను పూర్తి చేసేందుకు రూ.11,12,90,129 అవసరం ఉంటుందన్న అంచనాతో బడ్జెట్ మంజూరు కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ప్రతిపాదనల్లో లేబర్ బడ్జెట్ రూ. 6,68,26,082 కాగా మెటిరియల్ కాంపోనెంట్ రూ. 4,44,64,047 ఉంటుందని అంచనా వేశారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ ఆమోదం పొందితే వచ్చే సంవత్సరం కూలీలకు చేతినిండా పనులు దక్కనున్నాయి.

480 పనుల గుర్తింపు

ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో రైతులకు శాశ్వత ప్రయోజనం చేకూరేలా పనులను ఎంపిక చేశారు. దానిలో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి తయారు చేసిన లేబర్ బడ్జెట్‌లో 480 పనులను గుర్తించారు. ఊట కుంటలు, చిన్న ఊటకుంటలు, పారం పాండ్‌లు, సరిహద్దు కందకాలు, మట్టి కట్టలు, కుంటల్లో పూడికతీతలు, చేపల ఉత్పత్తి కుంటలు, సేద్యపు పంట బావి, కొత్త పంట కాలువల నిర్మాణం, కాలువల్లో పూడికతీత పనులు, నదేపు కంపోస్ట్ ఫిట్, వర్మీ కంపోస్ట్ ఫిట్, పశువుల పాకలు, గొర్రెలు, మేకల పాకలు, కోళ్లషెడ్లు వంటి శాశ్వత ప్రయోజనం చేకూరే పనులను ఎంపిక చేశారు. వాటితో పాటు హరితహారం మొక్కలు నాటడం, గుంతల తవ్వకం, మొక్కల సంరక్షణకు నీళ్ల పట్టడం వంటి పనులను చేర్చి అంతిమంగా అధికంగా కూలీలకు పనులు కల్పించేలా వచ్చే ఆర్థిక సంవత్సరం లేబర్ బడ్జెట్‌ను సిద్ధం చేశారు.

ప్రతిపాదనలు పంపించాం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో అధిక శాతం కూలీలకు పనులు కల్పించాలనే లక్ష్యంతో లేబర్ బడ్జెట్‌ను తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. వచ్చే సంవత్సరం కోసం 480 పనులను గుర్తించగా వాటిని పూర్తి చేసేందుకు రూ.11.12 కోట్ల అవసరం ఉందని అంచనా వేశాం. 2.60 లక్షల పని దినాలను కూలీలకు కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నాం. అందుకు అనుగుణంగా పనులను ఎంపికచేసి ఆమోదం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

\- బుచ్చన్న, ఏపీవో, ఈజీఎస్

క్లుప్తంగా

నేడు గ్రామసభ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సాధారణ గ్రామసభ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పంచాయతీ పరిధిలోని పలు సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం అధికారులతో కలిసి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి'



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

దహెగాం: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమార ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని మండల అంబేద్కర్ సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, రాజయ్య, గౌతం, రాజారాం, మహేందర్, అంకులు, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంతో పాటు నెలనెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపడుతున్న నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం కార్మికులు బల్దియా కార్యాలయం ముందు పికెటింగ్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ జమ చేయాలని, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సాయికృష్ణ గౌడ్

బెజ్జూర్: కంటి వెలుగు శిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సాయి కృష్ణగౌడ్ అన్నారు. పెద్దసిద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న సిద్దాపూర్ గ్రామంలో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మేఘన, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవచండీ హోమం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

సిర్పూర్(టి): మాఘమాస మహోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని సంతోషి మాతా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. వేద పండితుల మంత్రాల నడుమ నవచండీ హోమం, కుంకుమార్చన నిర్వహించారు. మంగళవారం చండీ, సుదర్శన హోమం మహాపూర్ణాహుతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పండితులు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి, హేమలత, లక్ష్మీనారాయణ దంపతులు, వ్యాపారులు గజ్జల శ్రీనివాస్, గజ్జల సురేష్, భక్తులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

కాగజ్‌నగర్‌టౌన్: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆశ కార్యకర్తలు సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు ఆశ కార్యకర్తలు విధులు చేపడుతున్నారని, గతం కంటే ప్రస్తుతం పనిభారం ఎంతో పెరిగిందని పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి



ఆసిఫాబాద్‌అర్బన్: తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్ /దహెగాం/ బెజ్జూర్/ కౌటాల/ చింతలమానెపల్లి/ పెంచికల్‌పేట్/ వాంకిడి/ సిర్పూర్(టి): టీయూడబ్ల్యూజే ఐజేయూ సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లాలోని ఆయా తహసీల్దార్ల కార్యాలయాల ఎదుట జర్నలిస్టులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు అందించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఆయా మండలాల తహసీల్దార్లకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్, అక్రిడేషన్ కమిటీ సభ్యులు ప్రకాష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో అత్యున్నత స్థాయికి ఎదగాలి



నృత్యం చేస్తున్న కళాశాల విద్యార్థినులు

రెబ్బెన: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని ప్రిన్సిపాల్స్ సంఘం రాష్ట్ర నాయకులు, తిర్యాణి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు అన్నారు. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ నైతం శంకర్, అధ్యాపకులు తిరుపతి, బెల్లంపల్లి కళాశాల జూనియర్ అసిస్టెంట్ శ్రీలేఖ, అధ్యాపకులు సతీష్, గంగాధర్, శ్రీనివాస్, ప్రవీణ్, ప్రకాష్, అమరేందర్, రామారావు, మంజుల, వెంకటేశ్వరీ, సంధ్య, సుమలత, ఝాన్సీ, నిర్మల, సుమలత పాల్గొన్నారు.

తాపీ భవన నిర్మాణ కార్మికుల సంఘ సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని అర్హులైన ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచకొండ గిరీశ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పద్మశాలి భవనంలో తాపీ, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అపూర్వ సమ్మేళనంలో మాట్లాడారు. లేబర్ అధికారి కార్యాలయం ప్రతినిధి విజయ్ మాట్లాడుతూ ప్రతీ కార్మికుడు కార్మిక శాఖ గుర్తింపు కార్డు కలిగి ఉండాలన్నారు. తాపీమేస్త్రీల సంఘం ప్రతినిధులు దుర్గం ధర్మయ్య, దాసు, పెంటు, రాజన్న, సత్తయ్య, వెంకటేష్, ఇమ్రాన్, ఫయ్యాజ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఐఈవో శ్రీధర్ సుమన్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో 15వ తేదీ నుంచి నిర్వహించే ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు శంకర్, తిరుపతి, నిర్వాహకులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న శివమల్లన్న ఆలయం



శివమల్లన్న ఆలయం



ముస్తాబైన నందీశ్వరుడు

కాగజ్‌నగర్‌రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించే జాతర కోసం మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం ముస్తాబవుతుంది. ఈనెల 17 నుంచి 19 వరకు మూడు రోజుల పాటు జరగనున్న జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయంతోపాటు గోపురం, నందీశ్వరుడికి రంగులు వేశారు.

తరలిరానున్న భక్తులు..

మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే జాతరకు కాగజ్‌నగర్ ప్రజలతో పాటు ఆసిఫాబాద్, సిర్పూర్ (టి), పెంచికల్‌పేట్, బెజ్జూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు కూడా నడిపించనున్నారు.

ఆదివాసీ యువత విద్యపై దృష్టి సారించాలి

వాంకిడి: ఆదివాసీ యువత విద్యపై దృష్టి సారించాలని విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీఐ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని ఖెడెగాం గ్రామంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువు, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానంగా ఉంటే వారికి సహకరించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం గ్రామ యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం భట్‌పల్లి గ్రామానికి చెందిన పులి రాజేశం అనే వ్యక్తి అదృశ్యమైనట్లు సోమవారం కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. కూలి పని చేసుకునే రాజేశం ఆదివారం భార్యతో గొడవ పెట్టుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడన్నారు. రాజేశం ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. భార్య ఇందుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

బీసీలకు న్యాయం చేయాలి



బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్, అంబేద్కర్ చౌక్ వద్ద బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో దాదాపు 60 శాతం ఉన్న బీసీలకు కేవలం రెండు శాతం బడ్జెట్ కేటాయించిందన్నారు. ప్రభుత్వం స్పందించి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జక్కయ్య, వైరాగడె మారుతి, కోట వెంకన్న, ప్రణయ్, పోషన్న, లహుకుమార్, ఆవిడపు ప్రణయ్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యజ్ఞంలో పాల్గొన్న ప్రజలు

ఆసిఫాబాద్‌అర్బన్: వాతావరణంలో రోజురోజుకు సంభవిస్తున్న మార్పుల నుంచి, రకరకాల వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు యోగా ఎంతో అవసరమని, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని యోగాచార్య అశోక్ ఆర్య తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం ఆవరణలో హిందూవాహిని, తెలంగాణ పతాంజలి యువ భారత్, ఆర్యక్షత్రీయ సంఘం ఆధ్వర్యంలో పర్యావరణ శుద్ధి కోసం 51కుండీల శివసంకల్ప మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో గడ్డల కిరణ్, పిప్రిసాయి, సైదం నాగరాజు, మధుకర్, గురుమూర్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే జిల్లా అభివృద్ధి

- కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావు



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్: సమష్టి కృషితో జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని ధరణి కార్యాలయాన్ని సోమవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో పోడు పట్టాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, డీఆర్వో రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చాంబర్‌లో ఫైనాన్షియల్ లిగరసీ అవేర్‌నెస్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ కోవ హన్మంత్‌రావు, బ్యాంకు మేనేజర్లు, సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మించాలని వినతి

ఆసిఫాబాద్: వాంకిడి మండలం గోయగాం సమీపంలోని చిన్నషకీల్‌గూడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను జాతీయ రహదారి విస్తరణలో కోల్పోయామని, తమకు కొత్త భవనం కట్టించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టర్ హేమంత్ బొర్కడేకు వినతిపత్రం సమర్పించారు. పాఠశాలలోని 26 మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులు కుంరం లచ్చు, బాపూజీ, మహదేవ్‌రావు, వెంకట్రావు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

రెబ్బెన: రెబ్బెన ఫారెస్టు నర్సరీలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సోమవారం రెబ్బెన ఫారెస్టు నర్సరీలో పని చేస్తున్న కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నర్సరీ కార్మికులకు ప్రతినెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలన్నారు. వారికి కనీస కూలీగా రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.250తో కుటుంబాన్ని పోషించుకోలేక నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రతీ ఒక్కరికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ సంఘాల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘాలు, బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ఆదివాసీలపై సీఎం కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం ఆదివాసీ సంఘాల జేఏసీ, బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకుడు సోయం చిన్నన్న, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడం గణపతి, నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ ఆదివాసీలపై చేసిన వ్యాఖ్యలను సీఎం వెనక్కి తీసుకోవాలన్నారు. అనంతరం కాగజ్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మధూకర్, సతీష్, భిక్షపతి, పాషా, రాం ప్రసాద్, ప్రవీణ్, నవీన్, షాకీర్, మోతీరాం, దేవాజీ, నందయ్య, సల్మాన్, సతీష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

శివాజీ జయంతి ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: మండలంలోని ఆరె కులస్తులు ఈనెల 19న ఛత్రపతి శివాజీ మహరాజ్ 393వ జయంతిని ఘనంగా నిర్వహించాలని ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ధనుర్‌కర్ వసంత్‌రావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో సోమవారం ఆరె సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఆరె కులస్తులు ఐకమత్యంగా ఉండి గ్రామాల్లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించాలన్నారు. సంఘం నాయకులు నారులే వానుపటేల్, ఎల్ములే మధుకర్, దత్తు పటేల్, ఆనంద్‌రావ్, ప్రకాశ్, మనోహర్, బందు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేత



క్రీడాసామగ్రి అందజేస్తున్న సేవా ట్రస్ట్ సభ్యులు

రెబ్బెన: శ్రేయోభిలాషి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వివిధ రకాల క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రి అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు విష్ణు జగతి ఆదేశాల మేరకు మంచిర్యాల అధ్యక్షుడు ఇందూరి లత, తిరుపతి, జిల్లా అధ్యక్షుడు చెన్న సోమశేఖర్‌లు విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు సేవా ట్రస్ట్ తమ వంతు సహకారం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, ఏఎంసీ డైరెక్టర్ ఇంగు మల్లేష్, నాయకులు ప్రకాష్‌గౌడ్, రవీందర్, కూశన్న, సాగర్, రవీందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో యువకులకు సోమవారం పెంచికల్‌పేట్ ఎస్సై విజయ్‌కుమార్ వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుల్లో, ఆటల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై గంగరాం, ప్రభాకర్, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

విస్తృతస్థాయి సమావేశాలకు డీవైఎఫ్ఐ నాయకులు

రెబ్బెన: నల్గొండ జిల్లాలో జరుగనున్న తెలంగాణ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన డీవైఎఫ్ఐ నాయకులు సోమవారం తరలివెళ్లారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరి సతీష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువకులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. సమావేశాలకు తరలివెళ్లిన వారిలో జిల్లా నాయకులు తాళ్లపెల్లి రాజేశ్వర్, రేగళ్ల గణేష్ తదితరులు ఉన్నారు.